సాక్షి నంద్యాల

శనివారం | 23 | మార్చి | 2024



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం

కోడ్ ఉల్లంఘనలకు చెక్ పెట్టేందుకు ఎన్నికల కమిషన్ 'సీ' విజిల్ యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా ఫిర్యాదులను పరిష్కరించేందుకు కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. IIలో▸



వైభవోపేతం.. కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ జ్వాలనృసింహ స్వామి , చెంచులక్ష్మి అమ్మవార్ల తిరు కల్యాణోత్సవం శుక్రవారం ఎగువ అహోబిలంలో కనుల పండువగా జరిగింది. IIలో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:34	ఉ॥ 4:55
ఆదోని	సా॥ 6:37	ఉ॥ 4:58
నంద్యాల	సా॥ 6:34	ఉ॥ 4:52
ఆత్మకూరు	సా॥ 6:32	ఉ॥ 4:53
బనగానపల్లె	సా॥ 6:35	ఉ॥ 4:53

హదీస్ వెలుగు :

తప్పులు చేసేటప్పుడు ఎవరూ చూడటం లేదని అనుకోవద్దు. పైన ఆకాశం నుంచి అల్లాహ్ ప్రతిదీ చూస్తూ ఉంటాడు.

– పవిత్ర ఖురాన్

నారా వారి కరివేపాకు రాజకీయం

- మాండ్రకు చంద్రబాబు షాక్
- ఐదేళ్లుగా పార్టీ కోసం కష్టపడినా పట్టించుకోని టీడీపీ అధినేత
- 2024 ఎన్నికల్లో జిల్లాలో ముగ్గురికి హ్యాండ్ ఇచ్చిన బాబు
- మండిపడుతున్న పార్టీ శ్రేణులు



సాక్షి, నంద్యాల: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సొంత పార్టీ నేతలకే వరుస షాక్‌లు ఇస్తున్నారు. పార్టీ కష్టకాలంలో వెన్నంటి వుండి, పార్టీ కోసం కష్టపడిన నేతలను పూచిక పుల్లలా తీసి పడేస్తున్నారు. చంద్రబాబు ఎవరినైనా కరివేపాకులా వాడుకుని వదిలేస్తారనేందుకు నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి ప్రకటన మరో నిదర్శనంగా నిలిచింది. ఎన్నికల ముందు పార్టీలో చేరిన నాయకులకే అగ్ర తాంబూలం ఇచ్చి ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇస్తుండడంపై అసంతృప్త జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. నంద్యాల జిల్లా టీడీపీ సీనియర్ నేత, ఆ పార్టీ నంద్యాల పార్లమెంట్ అధ్యక్షుడు మాండ్ర శివానందరెడ్డికి చంద్రబాబు భారీ షాక్ ఇచ్చారు. రెండు వారాల క్రితం వరకు ఎంపీ టికెట్ నీకే అంటూ చెబుతూ వచ్చిన పార్టీ అధిష్టానం.. ఉన్నట్లుండి టికెట్ రేస్ నుంచి మాండ్రను తప్పించింది. 2014లో టీడీపీలో చేరిన మాండ్ర పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఫలితంగా 2019లో టీడీపీ నుంచి నంద్యాల ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. గత ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వీచిన ఫ్యాన్ సునామీలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి టీడీపీకి ప్రాతినిధ్యమే కరువైంది. గత ఎన్నికల్లో భారీ ఓటమి పాలైనా పార్టీకి అండదండగా ఉంటూ, కేడర్ చేజారిపోకుండా కాపాడుకుంటూ వస్తున్నారు. ఐదేళ్లుగా పార్టీ పిలుపు మేరకు చేపట్టే కార్యక్రమాలకు భారీ ఖర్చు కూడా పెట్టుకున్నారు. నారా లోకేశ్ యువగళం పాదయాత్రకు, నెల క్రితం ఆళ్లగడ్డలో నిర్వహించిన 'రా కదలిరా' సభల్లోనూ పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు హోదాలో అతను భారీగానే ఖర్చు పెట్టుకున్నారు.

ముగ్గురికి మొండిచేయి..

2024 ఎన్నికల్లో టీడీపీ అధిష్టానం నంద్యాల జిల్లాలో ముగ్గురు నేతలకు షాక్ ఇచ్చింది. డోన్‌లో మూడేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ధర్మవరం సుబ్బారెడ్డిని తప్పించి ఎమ్మెల్యే టికెట్ కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డికి, నంద్యాల అసెంబ్లీ ఇన్‌చార్జ్‌గా ఉన్న భూమా బ్రహ్మానందరెడ్డిని కాదని మాజీ మంత్రి ఫరూక్‌కు టికెట్ ఇచ్చారు. జిల్లాలో వారిద్దరికీ అన్యాయం జరిగినప్పుడే పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడి హోదాలో మాండ్ర అధినేతను ప్రశ్నించి ఉంటే ఇప్పుడు మాండ్రకు ఈ దుస్థితి తలెత్తేది కాదని మాండ్ర అభిమానులు పెదవి విరుస్తున్నారు. కాగా ఎంపీ టికెట్ రేసులో మాండ్రను తప్పిస్తున్నట్లు సమాచార అందడంతో తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని ఆ పార్టీ సీనియర్ నేతలు ఏవీ సుబ్బారెడ్డి, మల్లెల రాజశేఖర్ టీడీపీ అధినేతకు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. కానీ, వారం రోజుల్లో వేరే పార్టీ నుంచి జాయిన్ అయిన నేతకు ఎంపీ టికెట్ కట్టబెట్టడంపై సొంత పార్టీలోనే తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. టీడీపీలో కష్టపడి పనిచేసే నేతలకు ఫలితం ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బరిలోకి శబరి

రాయలసీమ ఉద్యమ నేత బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుమార్తె డాక్టర్ బైరెడ్డి శబరి భారతీయ జనతా పార్టీ నుంచి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. నంద్యాల జిల్లా అధ్యక్షురాలిగా పనిచేశారు. మార్చి మొదటి వారంలో ఆమె ఆ పార్టీకి రాజీనామా చేసి ఈనెల 15వ తేదీన చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గత కొన్నేళ్లుగా బైరెడ్డి కుటుంబానికి మాండ్ర కుటుంబానికి విభేదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో శబరి చేరికపై మాండ్రకు కనీస సమాచారం ఇవ్వలేదు. ఆమెను చేర్చుకుని వారం గడవక ముందే ఎంపీ టికెట్ ఖరారు చేస్తూ గురువారం చంద్రబాబు ప్రకటన విడుదల చేశారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- నిబంధనలు అతిక్రమించిన పబ్లిక్ హెల్త్ సిబ్బందికి, ఇద్దరు వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు షోకాజులు జారీ
- మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. నంద్యాల పట్టణంలోని 14వ వార్డు పరిధిలో పబ్లిక్ హెల్త్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న పుష్పలీల ఈ నెల 17వ తేదీన స్థానిక టీడీపీలో చేరి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి షోకాజు నోటీసు జారీ చేశారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు చట్టరీత్యా చర్యలలో భాగంగా విధుల నుంచి ఎందుకు తొలగించకూడదో ఏడు రోజులలోగా వివరణ ఇవ్వాలని కోరారు. సిబ్బంది తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా, రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇద్దరు వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు మెమోలు జారీ

నంద్యాల పట్టణంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగుల తొలగింపులో అలసత్వం చూపినందుకు గాను 38వ వార్డు ఇన్‌చార్జ్ ప్లానింగ్ సెక్రటరీ షేక్ ఇజాస్ అహ్మద్, 22వ వార్డు ఇన్‌చార్జ్ ప్లానింగ్ సెక్రటరీ తిరుమలేష్‌కు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి మెమోలు జారీ చేశారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వార్డు పరిధిలోని బ్యానర్లు, పోస్టర్లు తొలగించడంలో అలసత్వం చూపితే వార్డు ప్లానింగ్ సెక్రటరీలపై చర్యలు ఉంటాయని నోటీసులో పేర్కొన్నారు. ఏడు రోజులలోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

పోస్టల్ బ్యాలెట్‌కు పకడ్బందీ చర్యలు

- జర్నలిస్టులు సహా 13 శాఖల అధికారులకు అవకాశం



ఆళ్లగడ్డ: పోస్టల్ బ్యాలెట్ దుర్వినియోగం కాకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. పోలింగ్ సిబ్బందికి విధులు నిర్వర్తించే చోటే ప్రత్యేకంగా ఫెసిలేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఫెసిలేషన్ కేంద్రంలో సిబ్బంది తమ ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన ఫాం (12, 12ఏ)లను శిక్షణ సమయంలో అందజేస్తారు. ఎన్నికల విధుల్లో ఉండేవారు అక్కడే తమకు కేటాయించిన కేంద్రంలో బ్యాలెట్ తీసుకొని ఎన్నికల విధులకు వెళ్లే ముందే తమ ఓటుహక్కు వినియోగించుకొని అక్కడే రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. ఇందుకోసం 13ఏ ఫారంపై సంతకం చేసి ఏ గ్రూప్ లేదా బీ గ్రూప్ అధికారి సమక్షంలో ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుంది. సవరించిన నిబంధనలతో పోస్టల్ బ్యాలెట్లను సిబ్బంది తమ వద్ద అంటిపెట్టుకునే అవకాశం ఉండదు.

➤ ఎన్నికల్లో ప్రతి ఓటు ఎంతో కీలకం. అందుకే ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొనే ఉద్యోగులతో పాటు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ రైల్వే, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, విద్యుత్, వైద్య–ఆరోగ్య శాఖ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, పౌరసరఫరాల శాఖ, బీఎస్ఎన్ఎల్, పోలింగ్ కవరేజ్ కోసం ఈసీఐ ధ్రువీకరించిన మీడియా ప్రతినిధులు, అగ్నిమాపక శాఖ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోవచ్చు.

➤ సర్వీసు ఓటర్లుగా పరిగణించే త్రివిధ దళాల్లో పనిచేసే ఉద్యోగులకు కూడా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉంది. వీరికోసం ప్రత్యేకంగా ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెట్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ ఈటీపీబీఎస్ పోర్టల్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవచ్చు. బ్యాలెట్‌పై తమ ఓటుహక్కు వినియోగించుకున్న అనంతరం స్పీడ్ పోస్ట్ ద్వారా సంబంధిత రిటర్నింగ్ అధికారికి పంపాలి.

➤ ఉద్యోగి డిక్లరేషన్‌లో సంతకం లేకపోయినా, డిక్లరేషన్‌లో బ్యాలెట్ పేపర్ సీరియల్ నంబర్ రాయక పోయినా, గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ లేకపోయినా, ఓటేసిన పోస్టల్ బ్యాలెట్‌ను 13బీ కవరులో పెట్టకపోయినా, సీలు వేయక పోయినా తదితర కారణాల వల్ల బ్యాలెట్ ఓటు తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉంది.

న్యూస్‌రీల్

శనగల బసవన్నకు విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి శుక్రవారం పరోక్షసేవగా విశేషపూజలు నిర్వహించారు. మొత్తం 74 మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామి విశేషపూజను జరిపించుకున్నారు. నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనల అనంతరం ఫలోదకాలతో, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం అలాగే మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించారు.

అభ్యర్థులు నిబంధనలు పాటించాల్సిందే

- ఎస్పీ రఘువీర్‌రెడ్డి



బొమ్మలసత్రం: సార్వత్రిక ఎన్నికల్లో బరిలో నిలిచే అభ్యర్థులు బహిరంగ సభలు, సమావేశాలను మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనల మేరకు నిర్వహించుకోవాలని ఎస్పీ రఘువీర్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిసేలా చూడాలన్నారు. సభలు, సమావేశాలకు, ప్రచార వాహనాలు, లౌడ్ స్పీకర్లకు అనుమతి తీసుకోవాలన్నారు. ఓటర్లకు నగదు, మద్యం పంపిణీ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏదైనా కులాలు, ప్రాంతాలు, వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తేలా ప్రసంగాలు చేయకూడదన్నారు. ఆధ్యాత్మిక ప్రదేశాలు, విద్యాలయాల్లో ఎన్నికలకు సంబంధించిన ప్రచారం చేపట్టవద్దని ఎస్పీ హెచ్చరించారు. ఇతర పార్టీలకు చెందిన పోస్టర్లు చించటం, తొలగించటం చేయటం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు.

జాతీయ రహదారి పనుల అడ్డగింత

- బ్రిడ్జి నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- 10. బొల్లవరం రైతుల ఆందోళన



నేషనల్ హైవే పనులను అడ్డుకుంటున్న రైతులు

నందికొట్కూరు: కర్నూలు – గుంటూరు జాతీయ రహదారి 340సీ విస్తరణ పనులను 10. బొల్లవరం రైతులు అడ్డుకున్నారు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ప్రస్తుతం నందికొట్కూరు మండలం 10. బొల్లవరం గ్రామ పరిధిలో బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. కాగా బ్రిడ్జిని ఇష్టారాజ్యంగా నిర్మిస్తున్నారని, వర్షాకాలంలో వరద నీరు సమీప పొలాలను ముంచెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చేపట్టారు. ఈ విషయాన్ని ముందుగానే కాంట్రాక్టర్, ఎన్‌హెచ్ అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో శుక్రవారం పనులను అడ్డుకున్నారు. అక్కడ బ్రిడ్జి నిర్మాణంతో వానా కాలంలో వీపనగండ్ల, నాగలూటి పంట పొలాల మీదుగా వచ్చే వర్షపు నీరు భారీగా వచ్చి తమ పొలాలను ముంచేత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, పంట పొలాలకు అనుకూలంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోతే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. రైతుల ఆందోళన సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, బ్రాహ్మణకొట్కూరు పోలీసులు అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

దీక్షతో అల్లా దీవెనలు

పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేపట్టడంతో అల్లా దీవెనలు అందరికీ కలుగుతాయని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని జామియా, కురేసి మజీద్ అలాగే ప్రధాన మజీద్‌లో ముస్లిం సోదరులతో కలిసి వారు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులకు ఆహార పదార్థాలను వడ్డించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందేలా, ప్రజలంతా సుభిక్షంగా ఉండేలా దువా చేయాలని ముస్లిం సోదరులను వారు కోరారు. ఎన్నో సంవత్సరాలుగా నంద్యాలలో హిందూ ముస్లింలు ఐకమత్యంగా ఉన్నారన్నారు. – నంద్యాల



ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో శుక్రవారం పదో తరగతి గణిత పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 134 పరీక్ష కంద్రాల్లో 28,599 మంది విద్యార్థులకు గాను 25,911 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా.. 2,688 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. 10 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు 49 కేంద్రాలను, స్టేట్ అబ్జర్వర్ గంగాభవానీ పది పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి సజావుగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

మూడు విడతలుగా ఏహెచ్‌ఏలకు శిక్షణ

నంద్యాల సెంట్రల్: జిల్లా వ్యాప్తంగా ఇటీవల నూతనంగా నియమితులైన 124 మంది పశుసంవర్ధక సహాయకులకు మూడు విడతల శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పశుసంవర్థక శాఖాధికారి గోవిందనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి మొదలైన మొదటి విడత శిక్షణ ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందన్నారు. మొదటి విడతలో సమీప వెటర్నరీ, డిస్పెన్సరీల్లో ప్రయోగాత్మక శిక్షణ ఇస్తున్నామన్నారు. రెండవ విడతలో భాగంగా ఏప్రిల్ 01 నుంచి మే 15 వరకు థియరీ తరగతులను నంద్యాల, ఆళ్లగడ్డ డివిజన్ కేంద్రాలలో నిర్వహిస్తామన్నారు. మూడవ విడతగా మే 15 నుంచి ఆగస్టు 01 వరకు 60 రోజుల పాటు మరలా సమీప వెటర్నరీ, డిస్పెన్సరీల్లో ప్రయోగాత్మక శిక్షణ ఉంటుందన్నారు. నంద్యాల డివిజన్‌కు సంబంధించి 79 మంది, ఆళ్లగడ్డ డివిజన్‌కు సంబంధించి 45 మంది శిక్షణ తీసుకోనున్నారని చెప్పారు.

క్లుప్తంగా

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పిస్తున్న ఆలయ సిబ్బంది, పాల్గొన్న పర్యవేక్షకులు

శ్రీశైలంటెంపుల్: వచ్చే ఏప్రిల్ 26న అమ్మవారికి కుంభోత్సవాన్ని నిర్వహిస్తుండటంతో ఆలయ అధికారులు, ఉద్యోగులు శుక్రవారం కొబ్బరికాయలు సమర్పించారు. చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ, శుక్రవారం రోజున ఏ రోజు ముందు వస్తే ఆ రోజు శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించారు. అనంతరం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. కార్యక్రమంలో స్వామివారి ఆలయ ఏఈవో హరిదాసు, పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, అయ్యన్న, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య అవగాహనకు పెద్దాసుపత్రిలో టీవీల ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు ఆరోగ్య అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం పెద్ద టీవీలను సరఫరా చేసింది. వీటిని రద్దీగా ఉండే ఓపీలైన జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్ విభాగాల వద్ద ప్రదర్శనకు ఉంచనున్నారు. వీటి ద్వారా ఆరోగ్యానికి సంబంధించిన అంశాలు ప్రదర్శించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ టీవీలు కొన్ని నెలల కిందటే వచ్చినా గైడ్‌లైన్స్ తాజాగా రావడంతో అధికారులు ఓపీల వద్ద ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పోలీసులకు ఉగాది సేవా పురస్కారాలు

కర్నూలు/నంద్యాల (సెంట్రల్): పోలీసు శాఖలోని సివిల్, ఏఆర్, ఏపీఎస్పీ, అగ్నిమాపక శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసులకు ఉగాది పురస్కారాల పేరుతో వివిధ పతకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి దాదాపు 20 మంది సిబ్బందికి వివిధ పతకాలు దక్కాయి. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, ఏపీఎస్పీ ఆర్ఎస్ఐ చెంచయ్యకు ఉత్తమ సేవా పతకం, కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు, నంద్యాల సీసీఎస్ ఎస్ఐ గౌస్ మొహిద్దీన్, కర్నూలు ట్రాఫిక్ ఏఎస్ఐ ఓబులేసు, కర్నూలు త్రీటౌన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, గూడూరు హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు, ఇస్వి పీఎస్ హెడ్ కానిస్టేబుల్ రామయ్య, నంద్యాల ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ దామోదరం, నంద్యాల టూటౌన్ ఏఎస్ఐలు అరుణాచలం, వెంకటసుబ్బయ్య, ఆత్మకూరు ఏఎస్ మాసన్న, ఏపీఎస్పీ కర్నూలు సెకండ్ బెటాలియన్ ఆర్ఐ సాయిరాం, ఏఆర్ఎస్ఐ కేవీఆర్‌బీ ప్రసాద్, ఏఆర్ఎస్ఐ సుందర్‌రాజులకు సేవా పతకాలు దక్కాయి. అలాగే ఆత్మకూరు ఫైర్ స్టేషన్ అధికారి భీముడు నాయక్ ఉత్తమ సేవా పతకం, కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేస్తున్న పీసీ వేణుగోపాల్, భరత్ కుమార్, ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు కానిస్టేబుల్ హనుమంతురెడ్డికి సేవా పతకాలు దక్కాయి.

సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం

- ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదుల స్వీకరణకు సీ విజిల్ యాప్
- ఫిర్యాదు అందిన 5 నిమిషాల్లోనే రంగంలోకి ఫ్లయింగ్ స్క్వాడ్
- 100 నిమిషాల్లో ఫిర్యాదుకు పరిష్కారం
- జెడ్పీలో 24 గంటల పర్యవేక్షణలో ఎంసీసీ కంట్రోల్ రూం

మీ ఎదుట ఎవరైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తున్నా..అవినీతి, అక్రమాలు, ప్రలోభాలకు పాల్పడుతున్నా చూస్తూ ఉండొద్దంటోంది కేంద్ర ఎన్నికల సంఘం. కోడ్ ఉల్లంఘనలను ఆడియో, వీడియో రూపంలో జరుగుతున్న చోటి నుంచే తమకు ఫిర్యాదు చేయొచ్చని చెబుతోంది. ఇందుకు 'సీ' విజిల్ యాప్‌ను తీసుకొచ్చింది. సామాన్యుడి బ్రహ్మాస్త్రమైన ఈ యాప్ ద్వారా ఫిర్యాదులను స్వీకరించి 100 నిమిషాల్లోనే పరిష్కరించేందుకు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేకంగా కంట్రోల్‌రూం సైతం ఏర్పాటు చేసింది.

కర్నూలు(అర్బన్): సార్వత్రిక ఎన్నికల నిబంధనల పక్కాగా అమలు చేసేందుకు, ఉల్లంఘనలపై ఫిర్యాదులను స్వీకరించి వాటిని నిర్ణీత సమయంలోగా పరిష్కరించేందుకు జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ రూమ్ ఇద్దరు జిల్లా స్థాయి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటుంది. మూడు షిఫ్టుల ప్రకారం ఇక్కడ ఉద్యోగులు విధులు నిర్వహిస్తుంటారు. ఒక షిఫ్ట్ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పనిచేస్తుంది. రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు, మూడో షిఫ్ట్ రాత్రి 10 నుంచి తిరిగి ఉదయం 6 గంటల వరకు పనిచేస్తుంది. ప్రతి షిఫ్ట్‌లో 8 మంది ఉద్యోగులు ఖచ్చితంగా ఇక్కడే ఉంటూ ప్రజలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారు. అలాగే వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారమయ్యే వ్యతిరేక కథనాలపై కూడా ఎంసీసీ కంట్రోల్ రూమ్ నుంచి చర్యలు తీసుకుంటారు.

షెడ్యూల్ వచ్చిన నాటి నుంచే సీ విజిల్ ...

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి సీ విజిల్ యాప్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఫోటో, వీడియో, ఆడియో ఏదైనా రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లోనే ఈ సమాచారాన్ని సంబంధిత ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు పంపుతారు. ఈ టీం 15 నిమిషాల్లో ఆ ప్రాంతానికి వెళ్లి 30 నిమిషాల్లో విచారణ పూర్తి చేసి నివేదికను ఎన్నికల అధికారికి చేరవేస్తారు. ఈ నివేదికపై సంబంధిత ఎన్నికల అధికారులు 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. మొత్తం వంద నిమిషాల్లో సీ విజిల్ యాప్‌లో అందిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటారు. అలాగే ఫిర్యాదు స్టేటస్ తెలుసుకునే వెసులుబాటు కూడా ఇందులో ఉంది.



జెడ్పీలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో పనిచేస్తున్న ఎన్నికల సిబ్బంది

ఎలాంటి ఫిర్యాదులు చేయవచ్చంటే ...

ఎన్నికల్లో డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతులు అందించడం, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం వంటి ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో, ఆడియో రికార్డు చేసి అప్‌లోడ్ చేయవచ్చు.

ఎలా చేయాలంటే ...

మీ సెల్ ఫోన్‌లో యాప్ ఓపెన్ చేయగానే స్క్రీన్‌పై ఫొటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. ఇందులో మీ వద్ద ఏ ఆధారం ఉంటే ఆ ఆప్షన్‌ను ఎంపిక చేసుకుంటే మీ లోకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఆధారాన్ని అప్‌లోడ్ చేయాలి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరిస్తే ఈ ఫిర్యాదు నేరుగా ఎన్నికల సంఘానికి చేరుతుంది. ఎస్ఈసీకి చేరిన ఈ ఫిర్యాదును అక్కడి అధికారులు వెంటనే సంబంధిత ఎంసీసీ కంట్రోల్ రూమ్‌కు చేరవేస్తారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు వెంటనే చర్యలకు ఉపక్రమిస్తారు.



రిజిస్టర్ చేసుకోండిలా ...

గూగుల్ ప్లే స్టోర్‌లో 'సీ విజిల్ ' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్ నెంబర్ ద్వారా దానిలో రిజిస్టర్ చేసుకోగానే, ఓటీపీ నెంబర్ వస్తుంది. దాన్ని నమోదు చేసిన వెంటనే సీ విజిల్ యాప్‌ను ఉపయోగించుకోవచ్చు. ఈ యాప్ ద్వారా ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయొచ్చు.

పౌరులను భాగస్వామ్యం చేసేందుకు సీ విజిల్



సార్వత్రిక ఎన్నికల్లో పౌరులను భాగస్వామ్యులను చేసేందుకే భారత ఎన్నికల సంఘం సీ విజిల్ యాప్‌ను అమలు చేస్తోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేసేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది. జెడ్పీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ రకాల ఫిర్యాదులు 56 వచ్చాయి. వీటిలో 35 ఫిర్యాదులను పరిష్కరించాం. ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలు పని చేస్తుంది. పౌరులు ఎప్పుడైనా ఎన్నికలకు సంబంధించిన విషయాలపై ఫిర్యాదు చేయవచ్చు.

– జి. నాసరరెడ్డి, ఎంసీసీ జిల్లా నోడల్ ఆఫీసర్

జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారుల మార్పు

కర్నూలు (లీగల్): జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారులను మార్పు చేస్తూ బార్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం అత్యవసర జనరల్ బాడీ సమావేశం నిర్వహించి కొత్త అధికారులను ప్రకటించింది. పాత అధికారులు అసోసియేషన్‌లో కార్యవర్గ సభ్యులుగా ఉండటంతో కొత్త అధికారులను మార్పు చేశామని అసోసియేషన్ కార్యదర్శి ఎంవీ చక్రపాణి తెలిపారు. కొత్త ఎన్నికల అధికారులుగా జి.ప్రభాకర్‌రెడ్డి, సహాయకులుగా ఎం.శ్రీనివాసరెడ్డి, కె.రాజమోహన్‌రెడ్డి, ఎం.ఆంజనేయులు, ఎస్.ఇందుమతి ఉంటారని, ఎన్నికలు ఈ నెల 28న యథాతథంగా జరుగుతాయని పేర్కొన్నారు.

రెండో విడత ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం

కర్నూలు సిటీ: రెండో విడత ఇంటర్ మూల్యాంకనం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. రెండో విడతలో ఫిజిక్స్ 31 వేల సమాధాన పత్రాలు , ఎకనామిక్స్ 6 వేల సమాధాన పత్రాలు మూల్యాంకనం చేయాల్సి ఉంది. ఇందుకు 130 మంది అధ్యాపకులకు హాజరు కావాలని ఉత్తర్వులు ఇవ్వగా 72 మంది మాత్రమే క్యాంపు కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. రెండో విడత మూల్యాంకనం 25వ తేదీలోపు పూర్తి కావాలి. మూడో విడత 26 నుంచి కెమిస్ట్రీ, హిస్టరీ, నాలుగో విడత 28 నుంచి బోటనీ, జువాలజీ, కామర్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమై వచ్చే నెల 6వ తేదీతో ముగియాల్సి ఉంది. ఈ నెల 1 నుంచి మొదలైన మూల్యాంకనంలో ఇప్పటి వరకు కేవలం హిందీ సబ్జెక్టు మాత్రమే పూర్తయ్యింది. స్పాట్ వాల్యుయేషన్‌కు 612 మంది అధ్యాపకులకు ఉత్తర్వులు ఇవ్వగా, ఇప్పటి వరకు 480 మంది రిపోర్ట్ చేసుకున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో పని చేస్తున్న అధ్యాపకులు 132 మంది ఇంత వరకు రిపోర్ట్ చేయకపోవడంతో ఇంటర్మీడియేట్ ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. అయినా ఇంత వరకు రిపోర్ట్ చేయకపోవడంతో బోర్డు అధికారులు నేరుగా ఆయా కాలేజీల యాజమన్యాలకు ఫోన్లు చేస్తున్నా స్పందన రావడం లేదని తెలుస్తోంది.

బస్తిపాటికి అవకాశం..బత్తినకు అవమానం

- కర్నూలు ఎంపీ టిక్కెట్ జెడ్పీ మాజీ ఛైర్మన్ బత్తినకు దక్కని వైనం
- నేడు పార్టీకి రాజీనామా చేసే యోచన
- బస్తిపాటి నాగరాజును అభ్యర్థిగా ప్రకటించిన టీడీపీ అధిష్టానం

కర్నూలు: టీడీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థిగా బస్తిపాటి నాగరాజును ఆ పార్టీ అధిష్టానం శుక్రవారం ప్రకటించింది. ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకుని పని చేసిన వారికి కాకుండా వ్యాపారవేత్తకు ఎంపీ టిక్కెట్ ప్రకటించడంపై ఆ పార్టీ నేతల్లోనే విస్మయం వ్యక్తమవుతోంది. వ్యాపారవేత్త, ఆదోని పట్టణానికి చెందిన బత్తిని లక్ష్మీనారాయణ, హరియానా గవర్నర్ దత్తాత్రేయ ఓఎస్డీ భానుశంకర్, ఇటీవలే టీడీపీలో చేరిన డాక్టర్ సంజీవకుమార్, కర్నూలు జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ బత్తిన వెంకటరాముడు తెలుగుదేశం తరఫున ఎంపీ టిక్కెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించి భంగపడ్డారు. పార్టీ అధిష్టానం బస్తిపాటి నాగరాజు అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంతో శుక్రవారం సాయంత్రం టీడీపీ జిల్లా కార్యాలయానికి చేరుకుని అధ్యక్షుడు బీటీ నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు.

టీడీపీకి రాజీనామా చేసే యోచనలో బత్తిన

పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి మండలం రామలింగాయపల్లె గ్రామానికి చెందిన జెడ్పీ మాజీ ఛైర్మన్ బత్తిన వెంకటరాముడు తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ టిక్కెట్ కోసం ఆయన విశ్వప్రయత్నం చేశారు. అయితే, బత్తిన సామాజికవర్గానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బస్తిపాటి నాగరాజును ప్రకటించడంతో వెంకటరాముడు తీవ్ర మనస్థాపంతో ఆ పార్టీకి శనివారం రాజీనామా చేయనున్నట్లు సమాచారం.

కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరురూరల్: మంత్రాలయం మండల కేంద్రంలో రెండు చోట్ల కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో పట్టుబడిన మద్యాన్ని మీడియాకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రాలయంలోని రామచంద్రనగర్‌కు చెందిన ఈడిగ జయరాముడు నుంచి 576, అలాగే హనుమంతు అనే వ్యక్తి నుంచి 65 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయించినా, తరలిస్తున్నట్లు తెలిసే వెంటనే తన సెల్ నంబర్ 9440902579కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు నరసింహారెడ్డి, భరత్,లక్ష్మన్న , కర్నూల్ డీటీఎఫ్ పీసీలు వెంకటరాముడు, షేక్షావలి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా ప్రతినిధులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): భారత ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం 33 నిత్యవసర సేవల శాఖలతోపాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే మీడియా ప్రతినిధులకు కూడా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. మొదటి సారి మీడియా ప్రతినిధులకు ఈ సౌకర్యం అందుబాటులోకి రానున్నదని చెప్పారు. శుక్రవారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల అంశాలపై కలెక్టర్లు, ఎన్నికల నిర్వహణ అధికారులతో సమీక్షించారు. పోలీసు, విద్యుత్, రవాణా, పోస్టల్ తదితర 33 శాఖలు అత్యవసర సేవల విధుల్లో ఉంటుండడంతో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలన్నారు. రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, సదస్సులకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఓటర్లజాబితాకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న ఫారాలను ఈనెల 26లోపు పరిష్కరించాలన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను పటిష్టం చేయాలని, ప్రతి చెక్ పోస్టు వద్ద కనీసం ఒక కెమెరాతో స్టాటిక్ సర్వైలెన్స్ బృందాన్ని ఉంచాలన్నారు. సీజర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజన్సీలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, డీఆర్వో కె.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తనీయొద్దు

- ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్

కర్నూలు(అగ్రికల్చర్): వేసవిలో విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన బేతంచెర్ల, సోమయాజులపల్లె, గూడూరు, కర్నూలు శివారులోని కార్బైడ్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న సబ్‌స్టేషన్‌లను పరిశీలించారు. సామర్థ్యం పెంపు పనులను తనిఖీ చేశారు. అంతకు ముందు కర్నూలులోని విద్యుత్ భవన్‌లో ట్రాన్స్‌కో, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులతో సంయుక్తంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లోటుపాట్లను గుర్తించి నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలన్నారు. వేసవిలో బోర్లు, బావుల కింద పంటలు ఎండకుండా విద్యుత్ ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ ఉమాపతి, సీఈ మోహన్‌రావు, ట్రాన్స్‌కో ఎస్ఈలు బాబు రాజేంద్ర, రామకృష్ణ, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు హజ్ యాత్రికులకు శిక్షణ

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని అబ్బాస్‌నగర్ యూనిక్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని హజ్ యాత్రికులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జమియత్ ఉలమా అధ్యక్షులు మౌలానా డాక్టర్ ఖాజీ అబ్దుల్ మాజిద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ హజ్ కమిటీ, ప్రైవేట్ టూర్స్ హజ్‌కు వెళ్లే యాత్రికులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ శిబిరంలో హజ్ యాత్రకు సంబంధించి పుస్తకాన్ని అందజేస్తామని, ఆ తర్వాత హజ్ యాత్రికులకు ఇఫ్తార్ విందు ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9032875378 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రాజకీయ ప్రచార ప్రకటనలకు
అనుమతి తప్పనిసరి

కర్నూలు(సెంట్రల్): ప్రసార మాధ్యమాల్లో ప్రచురితమయ్యే, ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతో పాటు చెల్లింపు వార్తలు (పెయిడ్ న్యూస్) పర్యవేక్షిస్తుందని, మీడియా ఉల్లంఘనలు కూడా గుర్తించి తగిన చర్యలు తీసుకుంటుందని వివరించారు. రిజిస్టర్డ్ పార్టీలు, వారి తరఫున ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలు ప్రసారం చేసేందుకు అనుమతి కోసం నిర్ణీత నమూనాలో 3 రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజిస్టర్ కాని రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు వారి ప్రకటనలు ప్రసారానికి 7 రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు అందిన రెండు రోజుల్లోగా జిల్లా స్థాయి ఎంసీఎంసీ కమిటీ అనుమతి మంజూరు చేస్తుందన్నారు.

వైభవోపేతం.. అహోబిలేశుని కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు



ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ఆళ్లగడ్డ: పండితుల మంత్రోచ్చారణలు.. ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు.. భారీగా తరలివచ్చిన భక్తజనం సందోహం మధ్య అహోబిలేశుడి కల్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధానఘట్టమైన శ్రీ జ్వాలనృసింహస్వామి , చెంచులక్ష్మీ అమ్మవార్ల తిరు కల్యాణోత్సవం శుక్రవారం ఎగువ అహోబిలంలో కనుల పండువగా నిర్వహించారు. ముందుగా అహోబిలం మఠం పీఠాధిపతి శ్రీమన్ శఠకోప రంగనాథయతీంద్ర మహదేశికన్ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా ఎదురుకోళ్ల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారిని మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా కల్యాణ మండపానికి తోడ్కొని వచ్చి కొలువుంచారు. ముందుగా స్వామి, అమ్మవారికి కంకణధారణ చేశారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణ మధ్య మంగళ్యధారణ కార్యక్రమం నిర్వహించారు. చివరగా స్వామి, అమ్మవార్ల పాదాల వద్ద ముత్యాల తలంబ్రాలు పోసి కల్యాణ మహోత్సవ తంతు ముగించారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం కనులార తిలకించిన అశేష ప్రజానీకం మనసంతా పులకించి పోయింది.

జయజనార్దనా కృష్ణా రాధికాపతే

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన శుక్రవారం దిగువ అహోబిలంలో శ్రీప్రహ్లాదవరదుడు వేణుగోపాల స్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామున నిత్య పూజల్లో భాగంగా సుప్రభాత సేవతో స్వామిని మేలుకొల్పి అనంతరం అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామిని వేణుగోపాలస్వామి అలంకారంలోను శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను రుక్మిణి, సత్యభామలుగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయ దేవేరులతో ఉత్సవ పల్లకీని అధిరోహించిన ప్రహ్లాదవరదుడు మాడ వీధుల్లో సందడి చేస్తూ భక్తులకు కనువిందు చేశారు. అనంతరం గుడికి చేరుకున్న ఉత్సవమూర్తులను పూల ఊయలలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అభిషేకం నిర్వహించారు. రాత్రి పొన్నచెట్టు వాహనంపై భక్తులకు స్వామి వారు దర్శనమిచ్చారు. ఎగువ అహోబిలంలో కల్యాణోత్సవానికి ముందు విశేష పూజలు అందుకున్న ఉగ్ర నరసింహస్వామి గజవాహనం అధిరోహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



వేణుగోపాల స్వామి అలంకరణలో..



ఎగువ అహోబిలంలో గజవాహన సేవ



పొన్నచెట్టు వాహనంపై శ్రీప్రహ్లాదవరదుడు